సాక్షి
కుమురం భీం

ఆదివారం । 10 । మార్చి । 2024



వేలాలలో జనజాతర
వేలాల జాతరకు రెండోరోజూ రద్దీ కొనసాగింది. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు మల్లికార్జునస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. 8లో▸



'పది'కి ప్రత్యేక తరగతులు 9లో▸
ఆశ్రమ పాఠశాలల్లోనూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /24.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండవేడి పెరిగి.. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


సాయిచరణ్


గోపాల్

రెబ్బెన(ఆసిఫాబాద్): జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికై నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–19 బాలుర జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పిర్సింగుల సాయిచరణ్, గట్టు గోపాల్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆదివారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు తెలంగాణ రాష్ట్రం తరఫున ఆడనున్నట్లు తెలిపారు. వీరిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం, సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, సెపక్ తక్రా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, టగ్ ఆఫ్ వార్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు శనివారం అభినందించారు.

నేడు మహిళా దినోత్సవ వేడుకలు
కాగజ్‌నగర్ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11గంటలకు పట్టణంలోని బాలభారతి హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'నేటి సమాజంలో మహిళల పాత్ర' అనే అంశంపై ఉపన్యాసం, పాటలు తదితర పోటీలుంటాయని తెలిపారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న ప్రతినిధి

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండలం కిరిడీ గ్రామానికి చెందిన గోపాల్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు హనుమంతారావు శనివారం బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికసాయం అందేలా కృషి చేసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు, ఆదిలాబాద్‌కు చెందిన నారాయణరెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

10నుంచి 'ఓపెన్' తరగతులు ప్రారంభం
కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నవారు, ప్రస్తుతం మూడోసంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయని కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10, 17, 24, 31 తేదీల్లో కళాశాలలో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సదాశివ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.


జైనూర్‌లో అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

మత్తు వదిలేనా?

- పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు
- నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలని హెచ్చరిక
- ప్రత్యేక కార్యాచరణ చేపట్టిన విద్యాశాఖ
- యువతను చైతన్యపరుస్తున్న పోలీసులు

కౌటాల(సిర్పూర్): ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య మత్తు పదార్థాలు. వీటికి బానిసలుగా మారిన యువత, విద్యార్థులు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాల కట్టడితోపాటు యువత ఆ వైపు వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. యువత, విద్యార్థులు తెలిసీతెలియని వయస్సులోనే మత్తుకు అలవాటు పడి జీవితాలు చీకటిమయం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలని పోలీస్‌శాఖ భావిస్తోంది. మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వినూత్నంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

కమిటీలు.. బాధ్యతలు

పాఠశాల దశలోనే విద్యార్థులకు మద్యం, మాదకద్రవ్యాలు అలవాటవుతాయని, పిల్లల ప్రవర్తనలో మార్పులు వస్తే ఉపాధ్యాయులు గమనించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలో 739 పాఠశాలలుండగా.. 43,289 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అన్ని విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిటీలను ఏ పేరుతో పిలవాలనేది త్వరలో నిర్ణయిస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వెల్లడించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా వారికి పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సర్కారు తీవ్రంగా కృషి చేస్తోంది. గర్ల్ చైల్డ్ సేఫ్టీ గురించి కూడా పాఠశాలల్లో అవగాహన కల్పించనున్నారు. డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయని స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధమవుతోంది.

కమిటీలు ఏర్పాటు చేస్తాం



మత్తు పదార్థాల వినియోగం చాలా ప్రమాదకరం. పాఠశాల దశ నుంచే డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేస్తాం. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సమయం కేటాయించాలి. ప్రతీ విద్యార్థి ప్రవర్తనపై ఉపాధ్యాయులూ ప్రత్యేకదృష్టి సారించాలి. పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీ ఏర్పాటుకు విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో కమిటీ ఏర్పాటు చేస్తాం. – అశోక్, జిల్లా విద్యాధికారి

జిల్లాలో ఇదీ పరిస్థితి..
జిల్లావ్యాప్తంగా గతంతో పోల్చితే గంజాయి వినియోగం గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం. గంజాయి రవాణా కూడా పెరిగింది. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, వలస కూలీలను లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. గతేడాది జిల్లాలో 19 మందిని అరెస్ట్ చేసి రూ.3.48 లక్షల విలువైన 17.522 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా, కొంతమంది రైతులకు అక్రమార్కులు నగదు ఆశచూపి వానాకాలంలో పత్తిలో అంతరపంటగా గంజాయి సాగు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అటవీప్రాంతాలకు సమీపంలోని చేలలో గంజాయి సాగు చేయిస్తే అనుమానం రాదనే ఉద్దేశంతో రైతులను ఉసిగొల్పుతున్నారు. పోలీసులు తనిఖీ చేసిన సమయంలో అమాయకులపై కేసులు నమోదవుతున్నాయి.

'హరిత' లక్ష్యం ఖరారు

- జూన్‌లో పదోవిడత కార్యక్రమం
- టార్గెట్.. 27.34లక్షల మొక్కలు
- జిల్లాలో 335 నర్సరీల ఏర్పాటు
- పకడ్బందీగా మొక్కల పెంపకం


జైనూర్ నర్సరీలో పంపిణీకి సిద్ధంగా మొక్కలు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణకు హరితహారంలో భాగంగా జిల్లాలో పదో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధితశాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 335 నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. 2024–25 సంవత్సరానికి 27.34లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా 2023–24 సంవత్సరంలో సుమారు 34లక్షలకు పైగా మొక్కలు నాటారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు, ఖాళీ ప్రదేశాలు, జాతీయ రహదారులకు ఇరువైపులా పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఒకప్పుడు బీడు భూములు, చెత్తాచెదారంతో నిండిన ప్రదేశాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, విధిగా వాటికి నీరందించడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో చెట్లు ఎదిగి నీడనివ్వడంతోపాటు ఆహ్లాదం పంచుతున్నాయి.

నిరంతర శ్రమకు తగిన ఫలితం

హరితహారం కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం జీవం పోస్తోంది. జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, ఉపాధి కూలీలు, పంచాయతీ సిబ్బంది కలిసి నిరంతరం పడుతున్న శ్రమకు మొక్కలు మనుగడ సాధిస్తున్నాయి. గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, అవెన్యూప్లాంటేషన్లు కూడా పూర్తిస్థాయిలో మొక్కలతో కనిపిస్తున్నాయి.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం
పదోవిడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళిక ప్రకారం నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. అధికారులు ఎప్పటికప్పుడు నర్సరీలు పరిశీలిస్తున్నారు. జూన్‌లో మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
– సురేందర్, డీఆర్డీవో

జిల్లాలో శాఖలవారీగా లక్ష్యం

అటవీశాఖ	1.82లక్షలు	పశుసంవర్ధకశాఖ	5వేలు
డీఆర్డీవో	19.25లక్షలు	విద్యాశాఖ	40వేలు
వ్యవసాయశాఖ	30వేలు	విద్యుత్‌శాఖ	4వేలు
ఎస్‌సీసీఎల్	19వేలు	ఎండోమెంట్	ఒకవేయి
ఎక్సైజ్‌శాఖ	2లక్షలు	వైద్యశాఖ	ఒకవేయి
హార్టికల్చర్	10వేలు	పరిశ్రమలశాఖ	5వేలు
పోలీస్‌శాఖ	9వేలు	ఇంటర్మీడియట్‌విద్య	5వేలు
మున్సిపల్‌శాఖ	2.06లక్షలు	మార్కెట్‌కమిటీ	ఒకవేయి
ఇరిగేషన్ మీడియం	5వేలు	భూగర్భశాఖ	2వేలు
ఇరిగేషన్ ఆసిఫాబాద్	5వేలు	మైనార్టీ వెల్ఫేర్‌శాఖ	2వేలు
ఇరిగేషన్ మైనర్	5వేలు	పీఆర్‌రోడ్	10వేలు
రెవెన్యూ	10వేలు	ఆర్‌అండ్‌బీ	5వేలు
ఫిషరీస్	5వేలు	ఆర్టీసీ	5వేలు

భవన ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ


ఎంపీపీ, ఎంపీటీసీలతో ప్రారంభిస్తున్న కృష్ణారావ్

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని కేజీబీవీలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవన ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ చోటు చేసుకుంది. శనివారం భవన ప్రారంభోత్సవానికి జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావ్ వచ్చి ఎమ్మెల్యే కోసం వేచి చూశారు. ఆ తర్వాత ఎంపీపీ చునార్కర్ సువర్ణ, ఎంపీటీసీ సభ్యులతో కలిసి కృష్ణారావు భవనాన్ని ప్రారంభించారు. కాగా, ఎమ్మెల్యే రాకుండా భవనాన్ని ఎలా ప్రారంభిస్తారని స్థానిక బీజేపీ నాయకులు సంబంధిత అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇంతలో పెట్రోల్ పంపు వరకు చేరుకున్న ఎమ్మెల్యేకు బీజేపీ నాయకులు విషయం వివరించారు. దీంతో సంబంధిత అధికారులు ప్రొటోకాల్ పాటించనందున భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. అనంతరం పెట్రోల్ పంపు నుంచే వెనక్కివెళ్లారు.

ముగిసిన ఈజ్‌గాం జాతర


పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్ రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో నిర్వహిస్తున్న జాతర ముగిసింది. ఆలయంలో మూడు రోజులపాటు జాతర ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. శనివారం ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 5 గంటలకు రుద్రాభిషేకం, 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వదర్శనం, పూజలు, 2 గంటల నుంచి సర్వదర్శనం, అర్చన అభిషేకాలు, రాత్రి 8 గంటలకు మహాహారతి, ద్వారబంధనం కార్యక్రమాలు నిర్వహించారు. కొంతమంది భక్తులు బోనాలు పోసి మల్లన్నకు మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వేణుగోపాల్, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మైలారపు మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కేజీబీవీ సమస్యల పరిష్కారానికి కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని కేజీబీవీలోగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హామీ ఇచ్చారు. శనివారం కేజీబీవీలో రూ.2.30 కోట్లతో చేపట్టిన అదనపు గదులు, ల్యాబోరేటరీ నిర్మాణాలకు జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటర్, పదో తరగతి విద్యార్థినులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండి పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. కేజీబీవీలోని డ్రైనేజీ, టాయిలెట్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రాచారి, జిల్లా కోశాధికారి అరుణలోయా, పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, వలుపదాసు శ్రీదేవి, కౌన్సిలర్ జయచందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, చిప్ప మౌనిక, రాణి, రమేశ్, దీపక్, తిరుపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఇందిరమ్మ పథకం

- రేపటి నుంచి స్కీం ప్రారంభం
- జిల్లాలో 1,54,136 దరఖాస్తులు
- అర్జీదారుల్లో చిగురిస్తున్న ఆశలు



ఆసిఫాబాద్: కాంగ్రెస్ సర్కారు అసెంబ్లీ ఎన్నికల హామీలు దశలవారీగా అమలు చేస్తోంది. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు వంట గ్యాస్ అములులోకి రాగా, తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 11నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఈ పథకం వర్తింపజేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దీంతో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కల సాకారం కానుంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ముందుగా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. దశలవారీగా ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత ఉండి, సొంత స్థలం ఉన్నవారు ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షలు ఇస్తారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణ ఖర్చుల కింద రూ.5లక్షలు అందజేస్తారు. ఇందుకు గాను నాలుగు దశల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని నిర్ణయించారు.

ముందుకు సాగని డబుల్‌బెడ్రూంలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో డబుల్ బెడ్రూంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాకు 1,223 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. కొన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 480 డబుల్‌బెడ్రూంలు మంజూరు చేయగా, వీటిలో 288 మాత్రమే పూర్తి చేశారు. వీటికోసం రూ.5వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. లక్కీ డిప్ పద్ధతిలో ఎంపిక చేసినప్పటికీ ఎంపికలో పారదర్శకత లేదని కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచింది.

రేషన్‌కార్డే ప్రామాణికం
అభయహస్తం పథకంలో భాగంగా ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేస్తున్నారు. ఆహార భద్రత (రేషన్‌కార్డు) కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది . ఇప్పటికే దరఖాస్తుదారుల ఆధార్, రేషన్‌కార్డుల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 335 గ్రామపంచాయతీల్లో 1,63,647 దరఖాస్తులు రాగా, వీటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,54,136 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఏటా నియోజకవర్గానికి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేయడంతో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు


వేడుకలకు హాజరైన భక్తులు

జైనూర్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో పట్నాపూర్‌లో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు రూ.5లక్షలు అందించారని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆత్రం సుగుణక్క, హెచ్ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఖాతాను అనుసంధానించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: సీసీఐకి పత్తి విక్రయించిన రైతులు తమ బ్యాంక్, ఇండియా పోస్ట్ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేకుంటే డబ్బులు జమ కావని పేర్కొన్నారు. ఇప్పటికే పత్తి అమ్మి డబ్బులు జమ కాని రైతులు వెంటనే ఇండియా పోస్ట్ బ్యాంక్ అయితే పాన్, ఆధార్‌కార్డులతో సమీప పోస్టాఫీస్‌లో సంప్రదించాలని సూచించారు. తమ ఖాతాను సేవింగ్ ఖాతాగా మార్చుకుని క్రెడిట్ లిమిట్ పెంచుకోవాలని తెలిపారు. సేవింగ్‌ఖాతా అనుసంధానం అయినట్లు, క్రెడిట్ లిమిట్ పెరిగినట్లు నిర్ధారించుకుని పోస్ట్‌మాస్టర్‌తో ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. నకలు ప్రతిని సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఇవ్వాలని సూచించారు. ఖాతా యాక్టీవ్‌గా లేకుంటే ఆధార్‌తో అనుసంధానం చేయించాలని పేర్కొన్నారు. రైతులు తమ ఖాతా ఆధార్‌తో అనుసంధానం వివరాలు తెలుసుకునేందుకు http@// dbtbharat. gov. in, https@// myaadhaar. uidia. gov. inలో సంప్రదించాలని తెలిపారు. పని వేళలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీని 7330733437 నంబర్‌లో, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీని 7330733462 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సామూహిక వివాహాలు


సామూహిక వివాహాల్లో ఎమ్మెల్యేలు కోవ, బొజ్జు

ఆసిఫాబాద్: సిర్పూర్ (యూ) మండలం మహాగావ్‌లో శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి 12 నూతన జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. ఈ సందర్భంగా కొత్త జంటలకు పుస్తెమట్టెలు, నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఏటా కొత్త జంటలకు వివాహం జరిపించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సిర్పూర్ జెడ్పీటీసీ సభ్యురాలు కోవ అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్కా ఆడుతున్న ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌ వద్ద శనివారం మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కళ్యాణ్‌ తెలిపారు. డీఎస్పీ కరుణాకర్‌, సీఐ శంకరయ్య ఆదేశాల మేరకు పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా ఎండీ సాహిద్‌, మరో బాలుడు తమ సెల్‌ఫోన్‌లలో ఆన్‌లైన్‌ మట్కా ఆడుతూ పట్టుబడినట్లు ఎస్సై పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. మట్కా జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జైనూర్‌: ఈ నెల 2న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్‌ తెలిపారు. మండలంలోని పారా గ్రామానికి చెందిన కినక బాపురావు (35) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ నెల 2న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

లోకేశ్వరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని హవర్గ గ్రామ శివారులో ప్రాంతంలోని సుద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

లింగాపూర్‌లో దొంగతనం



పరిశీలిస్తున్న ఎస్సై, ఫింగర్‌ ప్రింట్‌ నిపుణులు

కడెం: మండలంలో లింగాపూర్‌ గ్రామానికి చెందిన చేపూరి నవ్య ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మహాశివరాత్రి సందర్భంగా నవ్య పక్కనే ఉన్న అత్తమ్మ రూంలో పడుకుంది. తెల్లవారి చూసేసరికి ఇంటి, బీరువా తాళం పగులగొట్టి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం సంఘటన స్థలాన్ని ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ ధ్వంసం

సిరికొండ: మండల కేంద్రంలో ఇంటి ఎదుట ఉంచిన బైక్‌ను దుండగులు ధ్వంసం చేశారు. మండల కేంద్రానికి చెందిన దోండే కాశీనాథ్‌కు చెందిన బైక్‌ను తన నివాసం ఎదుట ఉంచగా గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇనుపరాడ్‌తో దాడి చేసి బైక్‌ను ధ్వంసం చేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.



గర్భగుడిలో శివలింగం



బోనాలు పూజిస్తున్న మహిళలు



లక్ష్మీదేవరుల ప్రదర్శన

వేలాలలో జన జాతర

- రెండో రోజూ పోటెత్తిన భక్తజనం
- శివసత్తుల పూనకాలు.. లక్ష్మీదేవరుల ప్రదర్శన
- పట్నాలు, బోనాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- మూడు లక్షలకు పైగా భక్తుల రాక



మల్లికార్జునస్వామి దివ్యదర్శనం కోసం క్యూలైన్లో భక్తజనం

జైపూర్‌(చెన్నూర్‌): వేలాల జాతరకు రెండో రోజు భక్తులు పోటెత్తారు. భక్తజనంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. శంభో.. శివ శంభో అంటూ..శివనామ స్మరణతో వేలాల మార్మోగింది. జైపూర్‌ మండలం వేలాలలో రెండోరోజున శనివారం శ్రీ మల్లికార్జున స్వామి జాతర జోరుగా సాగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ ఏటా మూడు రోజుల పాటు మహా జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మొదటిరోజు శుక్రవారం భక్తులు గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించి గట్టు మల్లన్న స్వామికి బోనాలు పోసి పట్టు వస్త్రాలతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. రెండవ రోజున శనివారం గ్రామంలో ఒగ్గు పూజారులచే పట్నాలు వేసి, స్వామివారికి బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో మల్లికార్జున స్వామి ఆలయం కిటకిటలాడింది. శివసత్తుల పూనకాలు...లయబద్ధక నృత్యాలు.. లక్ష్మీదేవారుల ప్రదర్శనలు.. ఒగ్గు పూజారుల ఢమరుక మోతలతో వేలాల మార్మోగింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌, మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పిలిస్తే పలికే దేవుడిగా మల్లన్నస్వామిని భక్తులు తమ ఇష్టదైవంగా పూజిస్తారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు భారులు తీరారు.

మల్లన్నకు పట్నాలు

శ్రీ మల్లికార్జునస్వామి(మల్లన్న) అంటే గుర్తుకు వచ్చేంది పట్నాలు. సుదూరప్రాంతాల నుంచి జాతరకు తరలి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమ, వస్త్ర, కుడుక, రవిక, త్రిశూలం, గజ్జెల లాగులతో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రామగుండం సీపీ శ్రీనివాస్‌ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌, జైపూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్‌ సీఐ బన్సీలాల్‌, ఎస్సై ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో 800 మంది పోలీస్‌ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 50కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. సాయంత్రానికి భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



మల్లన్న స్వామికి పట్నాలు వేస్తున్న భక్తులు



జాతరలో భక్తజనం..



షాపింగ్‌లో బిజీబిజీగా భక్తులు

అక్రమ వెంచర్లపై చర్యలేవి..?



దండేపల్లి మండలం ముత్యంపేట, లక్సెట్టిపేట మండలం ఎల్లారం మధ్యలో వెలిసిన వెంచర్‌

- గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వెలుస్తున్న వైనం
- అనుమతులు తీసుకోకుండానే విక్రయాలు
- జెడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు

మంచిర్యాలటౌన్‌: జిల్లాలో యథేచ్ఛగా వెలుస్తున్న అక్రమ వెంచర్లపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. ఒక లేఔట్‌ను ఏర్పాటు చేస్తే, దాని అనుమతుల పేరిట ప్రభుత్వానికి ఆదాయం రానుంది. లేఔట్‌ వెంచర్‌ ఏర్పాటుతో ఆ స్థలంలోని పది శాతం భూమిని పల్లెల్లో గ్రామ పంచాయతీలకు, పట్టణాల్లో మున్సిపాలిటీలకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ పది శాతం భూమిని అప్పగించకుండానే వ్యవసాయ భూములను చదును చేసి ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. కొనుగోలు చేసిన వారికి ఇంటి అనుమతులు రాక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. గత నెల 16న జరిగిన జిల్లా ప్రజాపరిషత్‌ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు అనుమతులు లేని లేఔట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ఆశ చూపి..అమ్మకాలు జరిపి...

జిల్లాలో అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లను ప్రజలను మభ్యపెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేని వ్యవసాయ భూముల్లో తాత్కాలిక రోడ్లు వేసి ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. భవిష్యత్‌లో మంచి ధర వస్తుందని ఆయా ప్లాట్లను ప్రజలకు అంటగడుతున్నారు. ఇటీవల మంచిర్యాల మీదుగా జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతుండడంతో వాటికి కూతవేటు దూరంలోనే తమ వెంచర్లు ఉన్నాయని, తక్కువ ధరలో ఇప్పుడు కొనుగోలు చేస్తే, రెండు మూడేళ్లలోనే రెట్టింపు డబ్బులు వస్తాయనే ఆశపెడుతున్నారు.

నిబంధనలు పాటించకుండానే...

ఏదైనా ఒక వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. లేఅవుట్‌కు అనుమతుల కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఎంత స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు.. ఆ విస్తీర్ణంలో 10 శాతం మేర భూమిని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్‌ చేసివ్వడంతో పాటు, ఆ లేఔట్‌ య జమానులే 30 ఫీట్ల రోడ్లు, విద్యుత్‌ స్తంభాలు, డ్రై యినేజీల నిర్మాణం చేపట్టి లేఔట్‌కు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్‌ చేయవద్దని నిబంధనలు ఉన్నా సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో మాత్రం రిజిస్ట్రేషన్లు చేపడుతుండడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతాలైన రంగంపేట్‌, ఆండాళమ్మ కాలనీ, పాతమంచిర్యాల, రాజీవ్‌నగర్‌, దొరగారిపల్లె, గర్మిళ్ల, తిలక్‌నగర్‌ ప్రాంతాల్లో వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. మున్సిపల్‌ అధికారులకు ఫిర్యాదు వస్తేనే స్పందించడం, వెంచర్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించి చర్యలను తీసుకోకుండానే వదిలేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

'బియ్యం వ్యాపారితో ఎమ్మెల్యేకు సంబంధం లేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

చెన్నూర్‌: అక్రమ రేషన్‌ బియ్యం వ్యాపారితో ఎమ్మెల్యే వివేక్‌ వెంకటస్వామికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్‌ నాయకులు సుశీల్‌కుమార్‌, చెన్న సూర్యనారాయణ, తగరం రాజేశ్‌ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నూర్‌ మున్సిపాలిటీలో ఈ నెల 7న జరిగిన బడ్జెట్‌ సమావేశానికి ఎమ్మెల్యే వివేక్‌ హాజరయ్యారన్నారు. మహారాష్ట్రలోని సిరొంచ గ్రామానికి చెందిన దివ్యాంగుడైన రేషన్‌ బియ్యం వ్యాపారి తన సమస్యలు చెప్పుకునేందుకు ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చారని, మానవతా దృక్పథంతో అతని సమస్యలు విన్నాడన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకుల అక్రమ దందాలకు అడ్డుకట్ట పడడంతో చిల్లర ఆరోపణలు చేస్తున్నారన్నారు. రేషన్‌ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని పోలీసులు, సివిల్‌ సప్లయ్‌ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. సమావేశంలో నాయకులు చీర్ల సుధాకర్‌రెడ్డి, ఖలీల్‌, పాతర్ల నాగరాజు, చింతల శ్రీనివాస్‌, కొంపల్లి బానేశ్‌, పెండ్యాల శ్రీకాంత్‌, ఈర్ల నారాయణ, జక్కుల సత్యనారాయణ, కడవండి మహేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

చేంజ్‌ ఆఫ్‌ క్వార్టర్‌కు కౌన్సెలింగ్‌

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): శ్రీరాంపూర్‌ ఏరియాలో చేంజ్‌ ఆఫ్‌ క్వార్టర్‌ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం పట్టణంలోని ప్రగతి మైదానంలోని సీఈఆర్‌ క్లబ్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. 119 మందికి క్వార్టర్లు దక్కగా అధికారులు వెంటనే అలాట్మెంట్‌ కూడా అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్‌ డీవీ రావు, డీజీఎం(పర్సనల్‌) అరవింద రావు, పర్సనల్‌ మేనేజర్‌ రాజేశ్‌, డెప్యూటీ పర్సనల్‌ మేనేజర్‌ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'హరీశ్‌రావు వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న తపస్‌ నాయకులు

చెన్నూర్‌: రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ గదుల్లో కూర్చునే ఉద్యోగులకు వేతనాలు ఇస్తారా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 15వ తేదీ వరకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 90 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్లు కూడా దిక్కులేవన్నారు. సమావేశంలో తపస్‌ నాయకులు కొట్టె నాగరాజు, సింగిరెడ్డి సాంబయ్య, నూకల సురేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దొంగల అరెస్ట్‌

- సీసీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు అరెస్ట్‌, పరారీలో మరో నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్‌ సీఐ ఫణీందర్‌

తాండూ: మండల కేంద్రంలోని వైన్స్‌షాప్‌లో మద్యం చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా 48గంటల్లో పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూరల్‌ సీఐ ఫణీందర్‌ నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలోని మాధవి వైన్స్‌షాపుపైన రేకులను తొలగించి మద్యం ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం వైన్స్‌షాప్‌ను తెరచిన సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకోగా నిజం ఒప్పుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గుగ్గిల పోశెట్టి, షేక్‌ సోహెల్‌, గుండగాని మహేందర్‌, సెద్మాకి శ్రీకాంత్‌ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. ముగ్గుర్ని అరెస్టు చేయగా శ్రీకాంత్‌ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు గత నెల 22, 24, 27వ తేదీలతో పాటు ఈ నెల 2వ తేదీన సైతం దొంగతనానికి పాల్పడినట్లు సీసీ టీవీలో గుర్తించారు. అయితే పోశెట్టి మండల కేంద్రంలోనే బెల్ట్‌షాప్‌ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నిత్యం మాధవి వైన్స్‌లో నుంచి మద్యం తీసుకెళ్లేవాడు. అందులోనే దొంగతనం చేసేందుకు పక్కాగా ప్లాన్‌ చేసి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వరుసగా వైన్స్‌షాప్‌ పైన రేకులను తొలగిస్తూ దొంగతనానికి పాల్పడ్డాడు. మొత్తం రూ.2లక్షల విలువైన మద్యం దొంగిలించి విక్రయించినట్లు గుర్తించారు. దాచిపెట్టిన మద్యం పాటు నగదు సీజ్‌ చేశారు.

పార్టీ జెండా కూల్చి అక్రమ నిర్మాణం



కూల్చివేసిన పార్టీ జెండా



చేపడుతున్న అక్రమ నిర్మాణం

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని కోమటిచేనులో పార్టీ జెండాను కూలగొట్టి అక్రమ నిర్మాణం చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆపార్టీ అధికారంలో ఉన్నా ప్రస్తుతం రాష్ట్రంలో క్యాడర్‌ లేకపోవడంతో ఉన్న ఒకరిద్దరు నాయకులతో మాట్లాడుకుని జెండాను తొలగించి వ్యాపార సముదాయం నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలమా లావణి పట్టా అనేది పక్కన పెడితే ఖాళీగా ఉందని కబ్జాకు ప్రయత్నం మొదలు పెట్టారు. దీనిపై అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా సదరు వ్యక్తి అదే పార్టీతో పైకి రావడంతో పాటు జెడ్పీటీసీ, వైస్‌ ఎంపీపీ లాంటి ఎన్నో పదవులు అనుభవించడం గమనార్హం.

అదుపుతప్పి పండ్ల వ్యాన్‌ బోల్తా



గుడిపేట వద్ద బోల్తా పడిన వ్యాన్‌



పండ్లు తీసుకెళ్తున్న స్థానికులు

- పండ్లకోసం ఎగబడిన జనాలు
- నిమిషాల్లోనే వ్యాన్‌ మొత్తం ఖాళీ

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): అదుపుతప్పి పండ్ల వ్యాన్‌ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని యావత్‌మాల్‌లో శనివారం వ్యాన్‌లో బత్తాయి పండ్లు లోడ్‌ చేసుకుని మంచిర్యాల మార్కెట్‌కు బయలుదేరింది. హాజీపూర్‌ మండలం గుడిపేటలోని దుబ్బపల్లి జాతీయ రహదారి వరకు రావడంతో దుబ్బపల్లికి చెందిన ముడిమడుగుల వెంకటేశ్‌ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటే క్రమంలో పండ్ల వ్యాన్‌ రావడాన్ని గమనించి ఒక్కసారిగా బైక్‌ ఆపేశాడు. ఒక్క సారిగా ఆందోళనకు గురైన డ్రైవర్‌ ఒక్కసారిగా బ్రేక్‌ వేయడంతో వ్యాన్‌ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. గమనించిన స్థానికులు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు సైతం 'సందెట్లో సడేమియా'గా బత్తాయి పండ్లను పది నిమిషాల్లోనే ఖాళీ చేశారు. సదరు పండ్ల వ్యాపారికి దాదాపు రూ.లక్షకు పైగానే నష్టం వాటిల్లి ఉంటుందని పలువురు గుసగుసలాడుకోవడం కొసమెరుపు.

సీసీ కెమెరాలున్నా ఆగని చోరీలు

- సింగరేణిలో తరచూ దొంగతనాలు
- మామూలుగా వ్యవహరిస్తున్న అధికారులు



జీవీటీసీలో నిలువ ఉంచిన సామగ్రి (ఫైల్‌)



దొంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన సామగ్రి

మందమర్రిరూరల్‌: సింగరేణి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో పలుచోట్ల విలువైన సామగ్రి చోరీకి గురవుతోంది. ఎస్‌అండ్‌పీసీ విభాగం అధికారులు కొన్ని సందర్భాల్లో పత్రికల్లో వార్తలు వచ్చాక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. ఆ తర్వాత సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా విచారణ అనంతరం చోరీకి పాల్పడిన దొంగలను గుర్తించాల్సి ఉన్నా మరి పోలీసులు ఎందుకు ట్రేస్‌ చేయలేకపోతున్నారనే ప్రశ్న అందరినీ ఆలోచింపజేస్తోంది. కొన్ని సందర్భాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పుడు సామగ్రి భద్రంగా ఉంటుంది. వాటిని అవసరం నిమిత్తం తొలగించి వేరేచోట బిగించాక చోరీలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అక్కడి నుంచి సీసీ కెమెరాలు తొలగించిన విషయం దొంగలకు ఎలా తెలిసిందనేది అంతుచిక్కని ప్రశ్న. సామగ్రి పోయిందని వార్తా కథనాలు బయటకువస్తే తప్ప ఉన్నతాధికారులకు తెలియడం లేదు. ఏరియాలోని కేకే–5 గని ఆవరణలో జనవరి 17న సుమారు 10 మంది దొంగలు చొరబడి సెక్యూరిటీ సిబ్బంది చూస్తుండగానే విలువైన కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఆ తతంగం అంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలో నిక్షిప్తమైనా ఇంత వరకూ చోరీని ఛేదించలేదు. గత నెల నెల చివరి వారంలో కూడా జీవీటీసీలో వరుస చోరీలు జరిగినట్లు సమాచారం. వారం రోజుల క్రితం పట్టపగలే ఒక వ్యక్తి పెద్ద పైపు ఎత్తుకెళ్తుండగా అధికారులు సెక్యూరిటీ సిబ్బందికి కాల్‌ చేయగా రికవరీ చేసుకున్నారు. అంతకు ముందు చోరీకి గురైన సామాగ్రి గురించి ఆరా తీస్తే సీసీ కెమెరా రికార్డులు లేవనే అధికారులు సమాధానం ఇచ్చారు. అంతకు ముందు కూడా కేకే ఓసీలో విలువైన మెటీరియల్‌ చోరీకి గురైంది. అది కూడా సీసీ కెమెరాలో రికార్డయినా ఇంత వరకూ దొంగలను గుర్తించలేదు.

విజిలెన్స్‌, పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలి

ఇటీవల మందమర్రి ఏరియాలో జరిగిన చోరీలపై సింగరేణి విజిలెన్స్‌ అధికారులతో పాటు పోలీసులు కూడా గట్టి చర్యలు చేపట్టాలి. ఎక్కడెక్కడ చోరీలు జరిగాయి.. ఎంత మేరకు సామగ్రి చోరీకి గురైంది.. విధి నిర్వహణలో ఎవరున్నారు... అధికారులు, దొంగలకు, స్క్రాబ్‌ వ్యాపారులకు సంబంధాలున్నాయా? తదితర విషయాలపై క్షుణ్ణంగా విచారణ చేపడితే ఇంటి దొంగలు బయటపడే అవకాశముందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విజిలెన్స్‌ అధికారులు ఏరియాలో జరిగిన చోరీలపై విచారణ జరిపి ఇంటి దొంగలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భైంసాలో యువకుడి హత్య



సయ్యద్‌ సోహెల్‌ (ఫైల్‌)

భైంసాటౌన్‌: పట్టణంలోని సాయికాటన్‌ ప్రాంతంలో సయ్యద్‌ సోహెల్‌(24) హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం .. ఓవైసీనగర్‌కు చెందిన సోహెల్‌ శనివారం సాయంత్రం వస్తుండగా సాయి కాటన్‌ ప్రాంతంలో అదే సామాజిక వర్గానికి చెందిన మరో యువకుడు అతడిని అడ్డగించి స్క్రూడ్రైవ్‌ లాంటి పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో ఛాతి, ముఖం, నడుం వద్ద తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.